# 34. విధ్వంసం కూడా ఒక ప్రత్యేకత?

రాత్రి ఒంటిగంట కావస్తోంది. రోజూ అయితే ఈపాటికి ఇంటికి తెచ్చిన ఫైల్సు అన్నీ కాకపోయినా సగంపైగా అయినా చూసేసి నిద్రకోసం ఒక 'నాన్‌ఫిక్షన్' పుస్తకం తీసుకుని పక్కమీద వాలేవాడు రఘునందనరావు. ఇవాళ ఢిల్లీ నుంచి వచ్చిన అతిథులతో ఆ 'ఐదు నక్షత్రాల' హోటల్లో ఊకదంపుడు కబుర్లతో పదకొండున్నరైంది. వేడి కేరియర్లలో ఉంచినా డిన్నర్ స్టేల్ అయిపోతుందని తను హెచ్చరించబట్టి అందరూ గ్లాసులు పక్కనపెట్టి ప్లేట్ల మీద పడ్డారు. వాళ్ళకి గుడ్‌నైట్ చెప్పకుండా తన బంగళాకి వొచ్చెయ్యడం ఈ ప్రభుత్వ యాజమాన్య భారీ కర్మాగారం ఎం.డి.గా తనకి తగదు. అలా అలా; బెడ్‌రూం చేరేసరికి ఐదు నిమిషాలు తక్కువ ఒంటిగంట.

అప్పుడు ఫోన్‌కాల్.

"ఎస్-"

"నేను అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్ రామ్‌శరణ్ మాట్లాడుతున్నాను సార్. మీకు నిద్రా భంగం కలిగించినందుకు చింతిస్తున్నాను."

"పాయింట్‌కి రా!"

"మూడో షిఫ్టు పనివాళ్ళందర్నీ యూనియన్ లీడర్ సత్యం బైటికి లాగేశాడు సార్. మెషిన్స్ ఆపేవలసొస్తోంది సార్."

"ఏం జరిగింది?"

"ట్రెయినింగ్ అవుతున్న కుర్రాడు పట్టయ్య అనేవాడు ఫాక్టరీలో ఏక్సిడెంటయి చచ్చిపోయాడు కదండి సార్?"

"అలాగా; నాకు తెలీదే!"

పట్టయ్య అనే కుర్రాడు అసిస్టెంట్ ఫోర్మన్ ఉద్యోగానికి ఎన్నిక అయి ట్రెయినింగు అవుతూ నాలుగు నెలలయింది. మొత్తం 36 మంది ట్రెయినీలని మూడు బేచిలుగా విడదీసి షిఫ్ట్‌కి 12 మంది చొప్పున ఎలాట్ చేసేరు. రెండో షిఫ్ట్‌లో ఉన్న పట్టయ్య రాత్రి 12 గంటలకి డ్యూటీ దిగవలసి ఉండగా ఎనిమిది గంటలకి 'హెచ్' వర్క్‌షాప్‌లో ఒక ఎలెక్ట్రికల్ బోర్డు మీద పనిచేస్తూ షాక్ కొట్టి చచ్చిపోయాడు. ఈ సంగతంతా సేఫ్టీ ఆఫీసర్ వెంటనే చెబుతానన్నాడు. ఎం.డి. గారికి. ఈయన దొరక్క చెప్పలేకపోయాడేమో.

"సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌లో సగం మంది ఇక్కడే వున్నారు సార్. వెల్ఫేర్ ఆఫీసర్ గారు, విజిలెన్స్ ఆఫీసర్ గారు, ఎలెక్ట్రికల్ ఛీఫ్, వర్క్స్ మేనేజర్: అందరూ ఇక్కడే ఉన్నారు సార్. పోలీస్‌కి వెంటనే సమాచారం వెళ్లింది సార్. పట్టయ్య తల్లిదండ్రులు నర్సీపట్నం నుండి ఏ

రాత్రికైనా వస్తారు సార్. వాళ్లకోసం కారు వెళ్లింది."

"ప్రాబ్లెం ఏమిటి? శవాన్ని పోస్టుమార్టెమ్‌కి పంపొచ్చుగా."

"అదంతా వీల్లేదంటున్నాడండి యూనియన్ లీడర్ సత్యం. మూడో షిఫ్ట్‌కొచ్చిన వర్కర్స్‌ని, రెండో షిఫ్ట్ దిగే వర్కర్స్‌ని ఆపేసి పెద్ద మీటింగు పెట్టేడండి. ఎం.డి.గారు రిజైన్ చెయ్యాలి; వర్కర్స్‌కి ఇంకా సేఫ్‌గా పనిచేసే పరిస్థితులు కల్పించాలి. అని నినాదాలు చేస్తున్నారండి. మెషిన్స్ అన్నీ ఆపేయవలసొచ్చిందండి."

"ఓ కే. నేనొస్తున్నాను. పోలీస్ బందోబస్త్ కోసం అడిగేరా?"

"వస్తున్నారట సార్"

రఘునందనరావు పోలీసు డి.ఐ.జి. కి ఫోన్ చేసి "మీరు గాని ఎస్.పి. గారు గాని -" అంటూ వుండగానే -

"ఇప్పుడే మాకు మెసేజ్ అందింది. మీ ఫాక్టరీ నుంచి. మీరు పదండి, మేం వస్తాం" అని జవాబు వచ్చింది.

పని ఆపెయ్యడం మాత్రమే కాదు. శవాన్ని చూద్దామని వచ్చిన పట్టయ్య తల్లిదండ్రుల్ని కూడా అటు రానివ్వకుండా కొందరు కాపలా కాసేరు. పోలీసులు 'హెచ్' వర్క్‌షాపులోకి వెళ్లకుండా కొందరు కాపలా వున్నారు. కంట్రోల్సు అన్నీ వున్న కంప్యూటర్ రూమ్‌లో వందమంది వర్కర్సు ప్రవేశించి "సాఫ్ట్‌వేర్" అనబడే ఆ సున్నితమైన యంత్ర సామాగ్రి మీద సుత్తులూ సమ్మెటలూ ప్రయోగించి అంతటా బీభత్సం సృష్టించేరు. 'కార్మికుల ఐక్యత - వర్ధిల్లాలి! యాజమాన్యం అశ్రద్ధ - నశించాలి! పని పరిస్థితులు - బాగు పర్చాలి!" అంటూ కార్మిక నాయకుడు సత్యం ఆధ్వర్యంలో నినాదాలు వినిపిస్తున్నాయి.

"మీకు కార్మికుల ప్రాణాలంటే లక్ష్యం లేదు. ట్రెయినింగ్ అవుతున్న వర్కర్ల చేత స్వతంత్రంగా పనిచేయించుకుంటూ ఓవర్‌టైమ్ ఎలవెన్సులు మిగుల్చుకోడం మీకు పెద్ద జబ్బు అయిపోయింది. పాతికేళ్ళు నిండని పట్టయ్యకి యాజమాన్యం అశ్రద్ధ వల్ల నూరేళ్ళు నిండిపోయాయి. దీనికి ఎం.డి. రఘునందనరావు జవాబుదారీ వహించి రిజైన్ చెయ్యాలి. అంతవరకు ఫ్యాక్టరీ పనిచెయ్యదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం" అన్నాడు కార్మిక నాయకుడు సత్యం. "హెచ్చరిస్తున్నాం" అన్నారు ముక్తకంఠంతో కార్మికులు.

"మిస్టర్ సత్యం! మనం అంతా ఈ ప్రభుత్వ రంగ కర్మాగారంలో ఒక క్రమశిక్షణకి లోబడి పనిచేస్తున్నాం- ముక్కుపచ్చలారని ఒక యువ కార్మికుడు ప్రమాదవశాత్తు మృత్యువాత పడడం మిమ్మల్ని కదిలించినట్టే మమ్మల్ని కూడా కదిలించింది. ప్రమాదంలో మరణించినా, మరో రకంగా మరణించినా, ఏ వ్యక్తినీ తిరిగి బ్రతికించే శక్తి మనకెవ్వరికీ లేదు. పట్టయ్య మరణానికి నేను కూడా మీలో ప్రతి ఒక్కరిలాగానే విచారిస్తున్నాను. వర్కర్స్ ఇన్సూరెన్స్ రూల్సు ప్రకారం, ఫాక్టరీ రూల్సు ప్రకారం అతని కుటుంబానికి రావలసిన నష్టపరిహారం చెల్లిస్తారు. ఆ కుటుంబంలో మరో వ్యక్తికి అర్హతల్ని బట్టి ఒక ఉద్యోగం ఇచ్చే ఏర్పాటు కూడా చేస్తాను. మీరు

దయచేసి ఈ విధ్వంసకాండ ఇకనైనా ఆపి దేశాన్ని నష్టపరచడం మానండని ప్రార్థిస్తున్నాను" అని ఎం.డి. రఘునందనరావు సత్యానికి, అతని నాయకత్వంలో నినాదాలు చేస్తున్న కార్మికులకి చేతులు జోడించి నమస్కారం చేసి చెప్పాడు.

"నష్టపరిహారంట, నష్టపరిహారం! ఎంతిస్తావు. మహా? పదివేలో పన్నెండువేలో పారేస్తావు! అంటే, నువ్వొక్క నెలలో సంపాదించే అంత డబ్బుతో ఒక నూరేళ్ళ జీవితాన్ని ఒక నిండు ప్రాణాన్ని కొంటావన్నమాట. చూడండి, కార్మిక సోదరులారా; మన ఎం.డి.గారి ఔదార్యం! ఇవాళ పట్టయ్య చనిపోయాడు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రేపు నువ్వూ నువ్వూ నువ్వూ అందరూ ఇలాగే అర్థంతరంగా మరణించి మీ మీ కుటుంబాలకి జస్ట్ టెన్ తౌజండ్ రుపీస్ పారేసి మేనేజిమెంటు హాయిగా ఉంటుంది. ఈ వ్యవస్థ ఇలాగే ఉండాలా, మారాలా, మీరే ఆలోచించండి!"

"వ్యవస్థ మారాలి!"

"మేనేజిమెంటు అలసత్వం - నశించాలి!"

"పట్టయ్య - అమరజీవి"

"కంప్యూటర్ సెక్షన్‌లో ఉన్న మాస్టర్ కంప్యూటర్‌కి ఏమీ కాకపోయినా ఫాక్టరీ డేటా అంతా ఉన్న అమూల్యమైన డిస్కులన్నీ ధ్వంసం చేసారు. పదహారు టెర్మినల్స్‌లో తొమ్మిది పూర్తిగా నాశనమయ్యాయి. మిగిలిన ఏడింట్లో నాలుగు మేజర్ రిపేర్సుకొచ్చాయి. మూడు స్వల్పంగా దెబ్బతిన్నాయి. నష్టం ఒక కోటీ అరవై లక్షలుంటుందని అంచనా" అని ఉదయం ఆరుగంటలకి రిపోర్టు వచ్చింది. పట్టయ్య మృతికి నష్టపరిహారంగా అతని తల్లిదండ్రులకి ఇరవై ఎనిమిది వేల రూపాయల వరకూ ఇవ్వవచ్చు. ఎం.డి.గారు తన నిర్ణయశక్తిని బట్టి ఇంకో అయిదువేలు ఇవ్వవచ్చు. పట్టయ్యకి అన్నదమ్ములు గానీ అక్క చెల్లెళ్లు గాని లేరు గనుకనూ, అతను అవివాహితుడు కనుకనూ ఆ కుటుంబంలో ఇంకో వ్యక్తికి ఉద్యోగం ఇచ్చే ప్రసక్తి లేదు.

అన్నిటిమీద "చచ్చినట్టు" ఆర్డర్సు వేసిన ఎం.డి. రఘునందనరావుకి చిన్న సందేహం వచ్చింది.

అన్ని దేశాల్లోనూ ఫాక్టరీలున్నాయి. ప్రమాదవశాత్తు ఫాక్టరీ వర్కర్లు మరణించడమో, వికలాంగులు కావడమో ప్రపంచం అంతటా జరుగుతూనే ఉంది, జరుగుతూనే ఉంటుంది కూడా. కాని ఏళ్ల తరబడి కృషి చేసి, పట్టరాని కాళ్లు పట్టి, పడరాని పాట్లు పడి, దేశ సౌభాగ్యం కోసం ఏర్పరచుకునే కర్మాగార యంత్రసామాగ్రి మంజూరు కోసం అక్షర జ్ఞానమైనా లేనివాళ్ల దయాదాక్షిణ్యం కోసం పడిగాపులు పడితే; చివరికి కోట్లాది రూపాయల మేధావి యంత్రాంగాన్ని సుత్తీసమ్మెటా ఉపయోగించి క్షణాల్లో ధ్వంసం చేసే సంస్కృతి మరే దేశంలోనైనా ఉంటుందా? ఎన్నికలనో ప్రమాదాన్నో మృత్యువునో ప్రకృతి వైపరీత్యాన్నో ఆధారం చేసుకొని తమ వాగ్ధాటితో జనాల్ని రెచ్చగొట్టి బీభత్సం, విధ్వంసం చేయించి మినీ నాయకులు మహా నాయకులయ్యే సంస్కృతి ఇంకెక్కడైనా సాగుతుందా? లేక ఇది మనదేశపు ప్రత్యేకతా? ★